

- **నాలుగు బోర్లు వేసినా చుక్క నీరు రాకపాయె**

**ఈ చిత్రం** సూర్యాపేట జిల్లా ఆత్మకూరు మండలం తెట్టెకుంట తండాకు చెందినది. పంటను కాపాడుకోవడానికి పొలంలో నాలుగు బోర్లు వేసినా ఫలితం లేదని రైతు పద్మ చెప్పారు. భూగర్భ జలాలు అడుగంటిపోయాయని, సర్కార్ నీళ్లు లేవని, పంటని ఎలా కాపాడుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. పంట మంచిగా ఎదుగుతున్న సమయంలోనే నీటి కొరత వేధిస్తుండటంతో కనీసం పెట్టుబడైనా వస్తుందో లేదో తెలియని పరిస్థితి నెలకొన్నదని తెలిపారు.



- **గంగమ్మా.. జాడ ఏదమ్మా..**

**వేసవికి** ముందే భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. పంటలకు నీళ్లు అందకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం పెద్దకోర్పోల్ గ్రామంలోని బావి కూడా అడుగంటింది.

# సాగునీటి కోసం రెండూర్ల కొట్లాట

## ఘర్షణలో పలువురికి గాయాలు.. కాంగ్రెస్ సర్కార్ తెచ్చిన తంటా



ఘటనా స్థలాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న పోలీసులు

తొర్రూరు మార్చి 5: రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం రైతులపాలిట కొట్లాటకు దారితీస్తున్నది. సాగునీటి సమస్యలు రోజురోజుకూ తీవ్రమవుతున్నా కొద్దీ రైతుల్లో ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి. పొలాలకు నీరందక పంటలు ఎండిపోతుండటంతో రైతులు తీవ్ర నిరాశలో ఉన్నారు. సాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో రైతుల మధ్య విభేదాలు పొడచూపుతున్నాయి. ఈ నేపథ్యంలో మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం అమ్మాపురం జీకే తండా, పెద్దవంగర మండలం బాలాజీతండాల మధ్య సాగునీటి కోసం రైతుల మధ్య ఘర్షణ చోటుచేసుకున్నది. మైలారం ఎస్సారెస్పీ ఫేస్-2 రిజర్వాయర్ నుంచి కాకతీయ మెయిన్ కెనాల్ ద్వారా డీపీఎం-57 కాలువకు నీరు రావాల్సి ఉన్నది. ఈ నీరు అమ్మాపురం జీకే తండా రైతులకు చేరడం లేదనే కారణంగా సమస్య తీవ్రతరమైంది. నీటి సరఫరా విషయం తెలుసుకోవడానికి వెళ్లిన రైతులు బానోతు మంగ్య, అజ్మీరా రమేశ్, గుగులోతు భిక్షంపై బాలాజీ తండా వాసులు దాడి చేశారు. డీపీఎం-57 కెనాల్ గేటును మూసివేయడం, నీరందక పోవడం వల్ల ఆగ్రహంతో ఉన్న రైతు మంగ్యాపై కర్రలతో దాడి చేయడంతోపాటు, రమేశ్‌ను నీటిలో ముంచి హింసించారు. వీరిని కాపాడేందుకు వచ్చిన భిక్షం కూడా తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

### నీళ్ల కోసం ఎదురు చూస్తున్నం

ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్నాం. ఇప్పుడు మా ఊరికి నీళ్లొచ్చాయి. మేము సంతోషించేలోగా కొందరు వ్యక్తులు వచ్చి గేట్లు బంద్ చేశారు. ఎందుకు చేస్తున్నారంటే అడిగితే మా మీదే దాడిచేశారు. ఈ గొడవ కొందరు నాయకుల ముందే జరిగింది. కానీ వాళ్లు స్పందించడమే లేదు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం మేల్కొనాలి. మా పంటలు ఎండిపోతున్నయి. రైతును పట్టించుకోని పాలన ఉంటేం, లేకుంటేం.

**-బానోత్ మంగ్య, రైతు, జీకే తండా**

- **పైరు ఎండింది..**



**ఈ చిత్రం** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం తిప్పాయిగూడకు చెందినది. ఓ రైతు వరి సాగు చేయగా నీళ్లు లేకపోవడంతో ఎండిపోయింది. బోరు నుంచి కూడా చుక్కనీరు వస్తలేదు. దీంతో పొలాన్ని మేకలకు వదిలేశాడు రైతు. అయితే మేత మేసిన మేకలు దాహం తీర్చుకోవడానికి బోరు దగ్గరికి వచ్చి చాలా సేపు ప్రయత్నించాయి.

- **పంట చేనులో పశువుల మేత**



**భూ తల్లినే** నమ్ముకొని కోటి ఆశలతో అప్పులు చేసి సాగు చేస్తున్న పంటలు కళ్లముందే ఎండిపోతుంటే అన్నదాతల గుండెలు బరువెక్కుతున్నాయి. తమ కడుపు నింపుతుందని భావించి సాగు చేసిన పంటలను పశువులకు మేతగా మారడంతో రైతులు దిక్కు తోచని స్థితిలో ఉన్నారు. బీఆర్ఎస్ హయాంలో దశాబ్దం పాటు రెండు పంటలు సాగు చేసి రాజుగా వెలిగిన రైతులు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పరిస్థితి పూర్తిగా మారి కరువు ఛాయలు అలముకుంటున్నాయని ఆందోళనకు గురవుతున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గంలోని మూసాపేట మండలం తుంకినీపూర్ గ్రామంలో రైతు గడ్డమీది రాములు ఐదు ఎకరాల్లో వరి సాగు చేశాడు. పంటకు పెట్టుబడిలో 80 శాతం ఇప్పటికే ఖర్చు చేశారు. నీళ్లు లేక ఇప్పటికే సగానికి పైగా పంట ఎండిపోయింది. గత్యంతరం లేక పంటను పూర్తిగా పశువుల మేతకు వదిలేశాడు.

- **నీళ్లు రావాయె.. పంట ఆగమాయె..**



**ఆదిలాబాద్** జిల్లా తలమడుగు మండలం కజ్జర్లకు చెందిన రైతు శార్ధా మోహన్ తొమ్మిదెకరాల్లో జొన్న వేయగా ప్రస్తుతం కంకి దశకు చేరింది. పది రోజులుగా నీటి సమస్య కారణంగా పంట ఎండిపోయే పరిస్థితికి వచ్చింది. దీంతో పంటను కాపాడుకునేందుకు రూ.35 వేలు ఖర్చు చేసి రెండు రోజుల కిందట రెండు బోర్లు వేసినా చుక్క నీరు పడలేదు. చేసేదేమీ లేక మూడు ఎకరాల జొన్న పంటలో పశువులను మేతకు వదిలేశాడు.

- **ఆశలు ఆవిరాయె..**



ఈమె పేరు కలమ్మ. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం తిప్పాయిగూడకు చెందిన ఈమె పొలాన్ని కౌలుకు తీసుకొని వరి సాగు చేసింది. అయితే నీళ్లు లేకపోవడంతో పంట ఎండిపోయింది. దీంతో అప్పు తెచ్చి పంటను సాగు చేసి నాలుగు రూపాయలు సంపాదించుకుందామన్న ఈమె ఆశలు ఆవిరయ్యాయి. చేసిన కష్టం పోతేపోనీగానీ అప్పు ఎలా తీర్చాలని కంటతడి పెట్టింది కలమ్మ.

# మా పంటలు ఎండబెట్టి నీళ్లెట్ల తీస్కపోతరు?

- నీటిపారుదల ఈఎన్‌సీ అడ్డగింత
- చలివాగు వద్ద రైతుల ఆందోళన
- బ్యాక్‌వాటర్ తగ్గిపోయి పంటలు ఎండుతున్నాయని నిరసన
- వెంటనే ధర్మసాగర్‌కు పంపింగ్ నిలిపివేయాలని రైతుల డిమాండ్



హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలోని దేవాదుల పంప్‌హౌస్ వద్ద అధికారులను అడ్డుకుని ఆందోళన చేస్తున్న చలివాగు ఆయకట్టు రైతులు

శాయంపేట, మార్చి 5: రాష్ట్ర నీటిపారుదల శాఖ ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ అనిల్‌కుమార్‌ను రైతులు అడ్డగించారు. శాయంపేట మండలం జోగంపల్లి శివారులోని దేవాదుల ఎత్తిపోతల పథకం ఫేజ్-2లో పంప్‌హౌస్ పరిశీలనకు ఆయన అధికారులతో కలిసి బుధవారం వెళ్లారు. చలివాగు నుంచి ధర్మసాగర్‌కు నీళ్లు ఎత్తిపోయడం వల్ల బ్యాక్‌వాటర్ తగ్గిపోయి తమ పంటలు ఎండిపోతున్నాయని మైలారం, హుస్సేన్‌పల్లి గ్రామాల రైతులు ఆందోళనకు దిగారు. 'మా ప్రాంతంలోని నీళ్లను మీరెట్ల తీసుకుపోతరు. మా పంటలను ఎండబెట్టి నీళ్లు తీసుకుపోతే ఊరుకునేది లేదు' అని మండిపడ్డారు. దీంతో ఒక మోటరును బంద్ చేయాలని ఇరిగేషన్ ఈఎన్‌సీ అధికారులకు సూచించడంతో రైతులు శాంతించారు.

### నీరందక ఎండుతున్న పంటలు

చలివాగు బ్యాక్‌వాటర్ కింద మైలారం, హుస్సేన్‌పల్లి తదితర గ్రామాల రైతులు సైఫన్లు పెట్టి వందలాది ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. భీంఘన్‌పూర్ నుంచి చలివాగులో గోదావరి జలాలను పోస్తూ.. అక్కడి నుంచి ధర్మసాగర్‌కు పంపింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే దేవాదుల పంప్‌హౌస్ నుంచి రెండు మోటర్లతో నిరంతరం ధర్మసాగర్‌కు నీళ్లు పంపింగ్ చేస్తున్నారు. దీంతో బ్యాక్‌వాటర్‌పై ఆధారపడి సాగు చేసిన పంటలకు నీరందక మోటర్లు కాలిపోతున్నాయి. కొద్ది రోజుల క్రితం రైతులు ధర్మసాగర్ పంపింగ్ మోటర్లు బంద్ చేయాలని ధర్నా చేశారు. ఈ నేపథ్యంలో ఇక్కడి పరిస్థితిని సమీక్షించేందుకు రాష్ట్ర నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ అనిల్‌కుమార్, వరంగల్ సీఈ అశోక్‌కుమార్, ఎస్‌ఈలు వెంకటేశ్వర్, మోహన్‌రావు కలిసి బుధవారం చలివాగు పంప్‌హౌస్ వద్దకు వెళ్లారు. మోటర్ల పంపింగ్, నీటి లిఫ్టింగ్, భీంఘన్‌పూర్ నుంచి వస్తున్న జలాలు, పంపింగ్ తదితర అంశాలపై అధికారులతో ఈఎన్‌సీ చర్చించారు. రికార్డులను పరిశీలించారు. జనగామ ప్రాంతానికి తాగునీటి సమస్యలు వస్తున్నందున ధర్మసాగర్ రిజర్వాయర్‌కు పంపింగ్ జరగాలని సూచించినట్టు తెలిసింది. అనంతరం చలివాగు ప్రాజెక్టుతూమును ఈఎన్‌సీ, సీఈలు పరిశీలించారు. తూము నుంచి వెళ్తున్న జాలుకాలువ నీళ్లను వెంటనే బంద్ చేయాలని ఈఎన్‌సీ అనిల్‌కుమార్ ఆదేశించారు. ఈఎన్‌సీ వచ్చిన విషయం తెలుసుకున్న మైలారం, హుస్సేన్‌పల్లి రైతులు పంప్‌హౌస్ వద్దకు చేరుకొని వారిని అడ్డుకున్నారు. తమ పంటలు ఎండిపోతున్నాయని మోటర్లను బంద్‌చేయాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాగునీటి ఇబ్బందులున్నాయని రెండు రోజుల తర్వాత మోటర్లు బంద్ చేయిస్తామని ఈఎన్‌సీ సర్దిచెప్పేందుకు ప్రయత్నించారు. దీంతో తమ పంటలు ఎండబెట్టి నీళ్లు ఎట్ల తీసుకుపోతరని రైతులు మండిపడ్డారు. చలివాగులో 15 ఫీట్ల నీళ్లు ఉంచిన తర్వాతే ధర్మసాగర్‌కు తరలించాలని గతంలో నిర్ణయం జరిగిందని రైతులు వివరించారు. ధర్మసాగర్‌కు నీటిని తీసుకెళ్తే ఊరుకునేది లేదని తెగేసి చెప్పారు.

- **కలెక్టర్ సారూ.. మా గోస ప్రభుత్వానికి చెప్పండి**



సాగుకు నీళ్లిచ్చి పంటలు కాపాడాలని కోరుతూ రైతులు ఆందోళనకు దిగారు. బుధవారం జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టరేట్ ఎదుట ధరూర్, కేటీదొడ్డి మండలాల్లోని కొండాపురం, ఈర్లబండ, వెంకటాపురం, గువ్వలదిన్నె, గంగాన్‌పల్లి, ఇర్కిచేడ్ గ్రామాల రైతులు బైఠాయించారు. ర్యాలంపాడ్ రిజర్వాయర్ 104 ప్యాకేజీ కాల్వ ద్వారా చివరి ఆయకట్టుకు నీరు అందడం లేదని, దీంతో పంటలు ఎండుముఖం పట్టాయని ఆవేదన వ్యక్తంచేశారు. తమకు నీళ్లు అందకుండా కొందరు రైతులు కాల్వల్లో అక్రమంగా మోటర్లు పెట్టి నీటిని వాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారబంది ద్వారా వచ్చే నీరు సరిపోవడం లేదని, పూర్తిస్థాయిలో నీరిచ్చేలా చర్యలు చేపట్టాలని కోరారు.

# మాకేమన్న ఓటేసిండ్రా? మీకెందుకు నీళ్లియ్యాలె?

- రాజన్న సిరిసిల్ల జిల్లా రైతులతో కాంగ్రెస్ నాయకుల దురుసు మాటలు
- కేటీఆర్ వల్లే నీళ్లొచ్చాయన్న రైతులు



రాజన్న సిరిసిల్ల జిల్లా బుగ్గరాజేశ్వరతండాకు చేరిన నీళ్లను చూపుతున్న రైతులు

కరీంనగర్, మార్చి 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ఎల్లారెడ్డిపేట: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అల్టిమేటంతో దిగొచ్చిన ప్రభుత్వం మల్కపూర్ రిజర్వాయర్ నుంచి నీటిని వదిలింది. అయితే, ఈ జలాలు మల్కపేట కాలువ మీదుగా బుగ్గరాజేశ్వర తండాకు చేరుకోగా, ఈ సందర్భంగా స్థానిక రైతులు మీడియాతో మాట్లాడారు. తమ వరి పంటలను కాపాడాలని ఎవరి చుట్టూ తిరిగినా పట్టించుకోలేదని, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి వద్దకు వెళ్తే.. 'మాకేమన్న ఓటు వేసిన్రా? మీకు నీళ్లెందుకు ఇవ్వాలె? సత్తే సావుండ్రి' అంటూ దురుసుగా మాట్లాడారని ఆవేదన వ్యక్తంచేశారు. 48 గంటల్లో నీళ్లివ్వకపోతే మంత్రి చాంబర్ ఎదుట బైఠాయిస్తానని కేటీఆర్ అల్టిమేటం జారీ చేయడంతోనే తమ ప్రాంత కాలువకు నీళ్లిచ్చారని రైతులు చెప్తున్నారు. నీటిని విడుదల చేయించిన కేటీఆర్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. కేటీఆర్ స్పందించకపోతే కాంగ్రెస్ నేతలు ఏ మాత్రం పట్టించుకునేవాళ్లు కాదని వాపోయారు. ఆపసోపాలు పడుతూ నాలుగు రోజులకే నీళ్లు బంద్ పెట్టారని, కేటీఆర్ రంగంలోకి దిగి అధికారులతో మాట్లాడి నీటి విడుదలకు సాయం చేశారని కొనియాడారు.

### నీళ్లొస్తలేవు అంటే సావుండ్రి అంటున్నరు



**మాకు** నీళ్లు వస్తలేవు అంటే మీరు సావుండ్రి అని మాట్లాడిన్రు. ఇన్ని రోజులైనా నీళ్లు రాలేదు. ఏ ఎమ్మెల్యే దగ్గరికి వెళ్లినా పని కాలేదు. కేటీఆర్ రాగానే నీళ్లు వచ్చినయ్, మా పొలాలు పారుతున్నయ్. కేటీఆర్ మంచిగా చేసిండు. రేవంత్ ఏం పని చేయలేదు. ఆ ఎమ్మెల్యే ఏం పని చేయలేదు. మహేందర్‌రెడ్డి కూడా ఏం చేయలేదు. నీళ్లు ఎందుకు ఇయ్యాలే? మాకేమన్నా ఓటు వేసినారా? అంటున్నరు.

**-అజ్మీరా శశ్మల్‌నాయక్, రైతు, బుగ్గరాజేశ్వరతండా (ఎల్లారెడ్డిపేట)**